క్లుప్తంగా

త్వరలో రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు



బుచ్చినాయుడుకండ్రిగలోని ఆర్‌బీకేలో ఉన్న పచ్చిరొట్ట విత్తనాలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను త్వరలో పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయాధికారి భారతి తెలిపారు. ఆమె మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలను పొలాల్లో సాగు చేయటంతో భూమిలో సత్తువ పెరుగుతుందని తెలిపారు. 10 కిలోల జనుము ధర రూ.880 కాగా 50 శాతం రాయితీపై రూ.440కు పంపిణీ చేస్తున్నామన్నారు. వీటిని బయోమెట్రిక్ విధానంలో రైతులకు పంపిణీ చేస్తామని తెలిపారు. జనుము విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్‌కార్డు, పట్టా పాసుపుస్తకాలు తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఈఓ రేవతి, తదితరులు పాల్గొన్నారు.

భక్తునికి వస్తువుల అప్పగింత



భక్తునికి నగదు అప్పగిస్తున్న ఎస్‌పీఎఫ్ సిబ్బంది

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఓ భక్తుడు పోగొట్టుకున్న బ్యాగు సహా వస్తువులను ఆలయ సిబ్బంది అతడికి అప్పగించారు. తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా ఎర్రగట్టుపల్లెకు చెందిన పిట్టల శ్రీకాంత్ అనే భక్తుడు సోమవారం శ్రీకాళహస్తీశ్వరస్వామివారి దర్శనార్థం ఆలయానికి వచ్చాడు. దర్శనానంతరం ఆలయ ప్రాంగణంలో తన బ్యాగ్‌ను పోగొట్టుకున్నాడు. గుర్తించి సిబ్బంది ఎస్‌పీఎఫ్ వారికి అందజేశారు. వారు మైక్ అనౌన్స్‌మెంట్ ద్వారా తెలపగా భక్తుడు రావడంతో అతనికి పోగొట్టుకున్న బ్యాగుతో పాటు అందులోని రూ.13 వేలు నగదును అందజేశారు.

మొక్కలు నాటిన స్కౌట్స్ విద్యార్థులు

శ్రీకాళహస్తి: పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు ఆర్సీపీ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో సోమవారం పరిసరాలను శుభ్రం చేసి, మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుప్రజ, రోవర్ లీడర్ విద్యాసాగర్, చంద్ర, కోదండరామిరెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అమరేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఉగ్గుమూడి గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో శ్రీ అన్నపూర్ణ సమేత అమరేశ్వరస్వామికి సోమవారం గ్రామస్తులు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అభిషేకాలు నిర్వహించారు.

బస్టాండ్‌లో భద్రత పెంచండి

తిరుపతి అర్బన్: నగరంలోని సెంట్రల్ బస్టాండ్‌కు భద్రతా సిబ్బందిని పెంచాలని జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీఓ) చెంగల్‌రెడ్డి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడును కోరారు. సోమవారం ఆయన తిరుపతిలోని ఎస్పీ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతి సెంట్రల్ బస్టాండ్ నుంచి రోజూ ప్రయాణికుల రాకపోకల గురించి వివరించారు. ఈ సందర్భంగా ప్రయాణికుల భద్రత దృష్ట్యా భద్రత పెంచాలని కోరారు. బస్టాండ్‌ను ఒకసారి పరిశీలించి అవసరమైన మేరకు సిబ్బంది ఏర్పాటు చేస్తామని ఎస్పీ వెల్లడించారు. ఆర్టీసీ తిరుపతి డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ భాస్కర్‌రెడ్డి వారితోపాటు ఉన్నారు.

క్రీడాకారులకు తైక్వాండో బెల్ట్ పరీక్షలు



బెల్ట్‌లను అందుకున్న క్రీడాకారులు

తిరుపతి కల్చరల్: ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో యశోదనగర్‌లోని వేమన విజ్ఞానకేంద్రంలో క్రీడాకారులకు సోమవారం బెల్ట్ పరీక్షలు నిర్వహించారు. గ్రాండ్‌మాస్టర్ కేవీ.బాబురావు సారథ్యంలో జరిగిన ఈ పోటీల్లో ప్రతిభ చూపిన వారికి నైపుణ్యత ఆధారంగా ప్రతిభా బెల్ట్‌లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వేమన విజ్ఞానకేంద్రం ప్రతినిధులు టెంకాయల దామోదరం, మల్లారపు నాగార్జున, నడ్డి నారాయణ, రెడ్డెప్ప, మునిలక్ష్మి ముకేష్, తైక్వాండో శిక్షకుడు ఎ.బాలకృష్ణన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

నాగలాపురంలో గుంతలమయంగా మారిన రోడ్డు, వరదయ్యపాళెం మండలం కోవూరుపాడు మార్గంలో బావులను తలపిస్తున్న వర్షపు నీటి గుంతలు





వణుకు.. ఎముకల్లో బెణుకు

రహదారులు ప్రగతికి ఆనవాళ్లు..ప్రజల జీవన ప్రమాణంలో ప్రధాన భూమికలు.. ఇంత ప్రాధాన్యం ఉన్న రోడ్ల గురించి పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. సత్యవేడు నియోకవర్గంలోని వరదయ్యపాళెం మండలం కోవూరుపాడు, నాగలాపురం మండల కేంద్రం ఇలా నియోజకవర్గం వ్యాప్తంగా ఎక్కడ చూసినా ఏమున్నది గర్వకారణం అన్న రీతిలో రోడ్లన్నీ చిరుజల్లులకే ఛిద్రమై, దర్శనమిస్తున్నాయి. ఫలితంగా ఆ దారుల్లో ప్రయాణించడానికి జనం వణికిపోతున్నారు. వాహనాలు జారుతుండడంతో ఎముకల్లో బెణుకు వచ్చి ఇబ్బందులు పడుతున్నారు.

- చిరుజల్లులకే ఛిద్రమైన రహదారులు
- పట్టించుకోని అధికారులు, నాయకులు
- ఇబ్బందులు పడుతున్న వాహనచోదకులు



వరదయ్యపాళెం: బురదమయంగా మారిన కోవూరుపాడు ప్రధాన రోడ్డు

వరదయ్యపాళెం: మండలంలోని యానాదివెట్టు పంచాయతీలోని కోవూరుపాడుకు వెళ్లే ప్రధాన రహదారి చినుకు పడితే చిత్తడవుతోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆ రోడ్డు పూర్తిగా బురదమయంగా మారడంతోపాటు బావులను తలపించే వర్షపునీటి గుంతలతో అస్తవ్యస్తంగా మారింది. దీంతో వాహనచోదకులు ఆ మార్గంలో వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాక నడిచి వెళ్లేవారు కూడా నీటి గుంతల్లో అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. గత మూడేళ్ల క్రితం గ్రామీణ రోడ్ల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అందులో భాగంగా ఈ రోడ్డుకు సంబంధించి 550 మీటర్ల దూరం సిమెంటు రోడ్డు నిర్మాణం కోసం రూ.39 లక్షలు నిధులు మంజూరు చేసింది. అయితే కారణాలు లేకుండా పనులు చేజిక్కించుకున్న కాంట్రాక్టర్ అర్ధంతరంగా పనులు నిలిపివేశారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా మూడు కల్వర్టులు మాత్రం నిర్మించి ఎర్త్ వర్క్ ద్వారా రోడ్డుకిరువైపులా సైడు బెర్ములు నిర్మించి, పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం ఈ మార్గంలో వెళ్లాలంటే గ్రామస్తులు ఇబ్బందిపడుతున్నారు.

చినుకు పడితే చిత్తడే

నాగలాపురం: మండలంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో చిన్నపాటి వర్షానికి రోడ్లు గుంతలమయంగా మారాయి. ప్రస్తుతం రెండు రోజులుగా వర్షాలు పడటంతో గుంతల్లో నీరు నిలిచిపోయింది. దీంతో పాదచారులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్లు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నరకయాతన పడుతున్నాం



పెద్ద పాండూరు ప్రధాన రోడ్డు మార్గం నుంచి మా ఊరికి వెళ్లేందుకు అర కిలో మీటరు దూరం రాకపోకలు సాగించడానికి నరకయాతన పడుతున్నాం. అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. నేటి ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించి, నెలలు గడుస్తున్నా, వర్షాలకు దెబ్బతిన్న రహదారుల గురించి పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తిన చందంగా వ్యవహరిస్తోంది.

– జయసూర్య, స్థానికుడు, కోవూరుపాడు, వరదయ్యపాళెం మండలం

చిరుజల్లులకే అవస్థలు పడుతున్నాం



ఇటీవల తరచూ కురుస్తున్న వర్షాలకు మా ఊరి రోడ్డు ఛిద్రమైంది. బావులను తలపించేలా రోడ్డు పొడవునా గుంతలు ఏర్పడి, అందులో నీరు నిల్వలు చేరాయి. ఈ మార్గంలో మోటారు బైకుపై వెళ్లాలన్నా జారిపడుతూ నిత్యం ప్రమాదాలకు గురవుతున్నాం. నడిచి వెళ్లాలన్నా నరకయాతన పడుతున్నాం. తక్షణమే రోడ్లు బాగు చేయాలి.

– కిరణ్, స్థానికుడు, కోవూరుపాడు, వరదయ్యపాళెం మండలం

రోడ్డును బాగు చేయండి



మా ఊరి రోడ్డుపై వెళ్లాలంటే భయమేస్తోంది. రాత్రి వేళల్లో నడిచి వెళ్లాలన్నా బురదమయంగా ఉన్న రోడ్డుపై కాలు తీసి కాలు వేయలేని దుస్థితి నెలకొంది. ఇంత అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డు గురించి ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. దీంతో మేము రాకపోకలు సాగించలేకపోతున్నాం. ఇప్పటికైనా స్పందించకపోతే ఆందోళనకు దిగుతాం.

– రాంబాబు, కోవూరుపాడు, వరదయ్యపాళెం మండలం

మెరుగైన వైద్య సేవలందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ, వైద్యశాల కమిటీ చైర్మన్ వి.ప్రతిమ

సత్యవేడు: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు, పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పీహెచ్‌సీ డాక్టర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు మెరుగైన సేవలందించాలని దాసుకుప్పం పీహెచ్‌సీ చైర్మన్, ఎంపీపీ వి.ప్రతిమ కోరారు. దాసుకుప్పం పీహెచ్‌సీలో సోమవారం సాయంత్రం వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. కమిటీ సభ్యులు ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ రామాంజనేయులు పాల్గొన్నారు. చైర్మన్ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు నిర్వహించాలని, పోషకాహారంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. పంచాయతీలో డెంగ్యూ, మలేరియా, విషజ్వరాలపై అవగాహన పెంచే క్యాంపులు నిర్వహించాలని సూచించారు. గర్భిణీలలో హైరిస్కు ఉన్న వారిని గుర్తించి ప్రసవ సమయంలో సాయం అందించాలన్నారు. డాక్టర్ మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలో 280 మంది గర్భిణులు ఉన్నారని తెలిపారు. సర్పంచ్ రవిరెడ్డి మాట్లాడుతూ వైద్యశాలలో నీటి సమస్య పరిష్కరించేందుకు బోరు మోటారు కొనుగోలుకు ఎంపీపీ నిధులు కేటాయించాలని కోరారు. వైద్యశాలలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కన్నావరం సర్పంచ్ జయంతి, డాక్టర్లు గుణశేఖర్, మురళీకృష్ణ, సీహెచ్‌ఓ పవన్, ఎంపీహెచ్‌ఓ సుబ్రమణ్యం, ఎంఎల్‌హెచ్‌పీలు కే.మేఘన, టి.మహాలక్ష్మి, కే.సుప్రియ, జీ.పావన, ఎం.సౌమ్య, లలిత, కే.కౌసల్య, బి.సుమ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వారాహి ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో వారాహి అమ్మవారు

సత్యవేడు: వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఉదయం అమ్మవారిని ఆభరణాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించి, హోమం పూజలు నిర్వహించారు. ముందుగా వారాహి దేవికి సామూహిక సహస్ర నామార్చన చేశారు. అమ్మవారి పూజకు ఐదు ప్రమిదల్లో దీపాలు వెలిగించి, నైవేద్యంగా పానకం సమర్పించారు. ఈమెను ఆరాధిస్తే జీవితంలో ఎదురయ్యే అడ్డంకులు తొలగిపోతాయని, శత్రుభయం ఉండదని, జ్ఞానం సిద్ధిస్తుందని ఇక్కడి ప్రజలు విశ్వశిస్తారు. సాయంత్రం భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ ధర్మకర్త రవి కుమార్ దేవర్, పూజారులు మల్లికార్జున ప్రసాదాలు అందజేశారు.

వైభవంగా ద్రౌపదీ స్వయంవరం



విశేషాలంకరణలో అర్జున ఉత్సవమూర్తి

శ్రీకాళహస్తి: పట్టణంలోని శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ద్రౌపదీ స్వయంవరం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జున పాత్రధారి మత్స్యయంత్రాన్ని ఛేదించిన ఘట్టం భక్తులను ఆకట్టుకుంది. అనంతరం అర్జున ఉత్సవమూర్తికి పలు రకాల అభిషేకాలు చేశారు. తరువాత ఉత్సవమూర్తికి విశేషాలంకరణ చేసి, చప్పరంపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకుని, కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి: పానగల్‌లోని హజరత్ జుంలేషాపీర్ దర్గాలో పీర్ల పండుగ సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నైవేద్యంగా పానకం షర్బత్, దర్గాలో చాదర్‌ను సమర్పించారు. మత సామరస్యానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకుంటారు. ఈ కార్యక్రమంలో దర్గా నిర్వాహకులు సయ్యద్ అహ్మద్, బాబా ఫరీద్, ఒరుగంటి నాగేశ్వరరావు, గరికపాటి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యంతోనే ఉద్యోగాలు



మాట్లాడుతున్న డీవీఎస్ చక్రవర్తిరెడ్డి

తిరుపతి అర్బన్: శరవేగంగా మారుతున్న కాలాన్ని చూస్తే చదువుతో పాటు నైపుణ్యం ఉంటేనే ఉద్యోగాలు అవకాశాలు వరిస్తాయని తిరుపతి న్యూ బాలాజీ కాలనీలోని ఎస్‌డీహెచ్‌ఆర్ డిగ్రీ, పీజీ కళాశాల అధినేత డీవీఎస్ చక్రవర్తి రెడ్డి వెల్లడించారు. సోమవారం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎస్‌డీహెచ్‌ఆర్ కళాశాలలో విద్యార్థులతో కలసి వరల్డ్ యూత్ స్కిల్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులతో పాటు నైపుణ్యతపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం డీఆర్‌డీఏ పీడీ ప్రభావతీరెడ్డి మాట్లాడుతూ డీఆర్‌డీఏతో పాటు సీడాప్, న్యాక్ ద్వారా ఇస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణాంశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతేకాకుండా జాబ్‌మేళా ద్వారా నిరుద్యోగులకు కల్పిస్తున్న ఉద్యోగాలను వెల్లడించారు. సెట్విన్ సీఈఓ మురళీకృష్ణ మాట్లాడుతూ దేశంలోనే కాకుండా విదేశాల్లో సైతం పెద్దపెద్ద ఉద్యోగాలు పొందడానికి నైపుణ్యం తప్పనిసరి అన్నారు. అనంతరం రీజనల్ స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి శ్యామ్‌మోహన్ మాట్లాడుతూ ఓ వైపు స్కిల్‌ను ప్రోత్సహించడమే కాకుండా గత నాలుగేళ్లుగా జాబ్‌మేళా ద్వారా యువత పొందిన ఉద్యోగాల అవకాశాలను వివరించారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఆర్.లోకనాథం మాట్లాడుతూ వరల్డ్ యూత్ స్కిల్ డేను ఘనంగా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



శ్రీవారి దర్శించుకున్న తిరుపతి ఎంపీ గురుమూర్తి

తిరుమల: తిరుమల శ్రీవారిని సోమవారం తిరుపతి ఎంపీ గురుమూర్తి, తెలంగాణ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

వినతులు పరిష్కరించండి



ప్రజా సమస్యల ప్రజావేదికలో వినతులను పరిశీలిస్తున్న తహసీల్దారు

బుచ్చినాయుడుకండ్రిగ: గ్రీవెన్స్ డే రోజున నిర్వహించే ప్రజావేదిక కార్యక్రమంలో వచ్చిన వినతులను విచారించి, పరిష్కరించాలని తహసీల్దార్ మహ్మద్ పటాన్ ఆలీఖాన్ తెలిపారు. ఆయన సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావేదికను సిబ్బందితో కలిసి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ డేలో వచ్చిన వినతులను విచారించి, తక్షణమే పరిష్కరించాలని తెలిపారు. భూ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబునాయుడు, మండల సర్వేయర్ వెంకట్రామయ్య, వీఆర్‌ఓలు, పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహం



విద్యార్థులకు ప్రోత్సాహక నగదు అందిస్తున్న డాక్టర్ రామచంద్రన్

నాగలాపురం: ఇటీవల జరిగిన పదో తరగతి, ఇంటర్‌మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాల టాపర్లుగా నిలిచిన స్థానిక హైస్కూల్ ప్లస్ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అభినందించారు. దీనికి ముఖ్య అతిథిగా నాగలాపురం డాక్టర్ రామచంద్రన్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు గర్వించదగిన ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు. అనంతరం పదో తరగతి పరీక్షల్లో ప్రథమ స్థానం సాధించిన తేజేశ్వర్‌కు రూ.5 వేలు, ద్వితీయ స్థానం పొందిన కె.సింధూజకు రూ.3 వేలు, ఇంటర్‌మీడియట్‌లో ప్రథమ స్థానం సాధించిన డి.నాగేశ్వరికి రూ.5 వేలు, ద్వితీయ స్థానం సాధించిన పవిత్రకు రూ.3 వేలు ప్రోత్సాహక నగదును డాక్టర్ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు డీఈఓ ప్రభాకర్‌రాజు, ఎంఈఓ బాబయ్య, జనార్దన రాజు, ప్రధానోపాధ్యాయులు కస్తూరయ్యా, సీఆర్‌పి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి



విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేస్తున్న సెక్టోరియల్ అధికారులు

సత్యవేడు: విద్యార్థులకు నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం అందించాలని తిరుపతి జిల్లా సెక్టోరియల్ అధికారులు సూచించారు. మండలంలోని పుదుకుప్పం తమిళ పాఠశాలను అధికారులు రామచంద్రారెడ్డి, సారథి, రుక్మండ, చంద్రశేఖర్ రెడ్డి బృందం పరిశీలించింది. వారు పాఠశాల రికార్డులు పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతోపాటు కూర్చుని భోజనం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం వండి విద్యార్థులకు వడ్డించాలని వంట నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం భారతి తదితరులు పాల్గొన్నారు.

ట్యాబ్‌లతో సాంకేతిక విద్య



ట్యాబ్‌లపై అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ

బుచ్చినాయుడుకండ్రిగ: మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక విద్యా బోధన అందించాలన్న సంకల్పంతోనే ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లను పంపిణీ చేసినట్లు ఎంఈఓ మునిసుబ్రమణ్యం తెలిపారు. బుచ్చినాయుడుకండ్రిగ గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకుని, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకంటే బాగా చదువుకోవాలని ఆకాంక్షించారు. ట్యాబ్‌లను చదువుల కోసమే వాడుకోవాలని, అనవసరమైన వాటి కోసం ఉపయోగించకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుక కొరతతో భవన నిర్మాణరంగం కుదేలు

శ్రీకాళహస్తి: నియోజకవర్గంలో ఇసుక కొరతతో భవన నిర్మాణ రంగం కుదేలయిందని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22, 23వ తేదీల్లో తిరుపతిలో జరిగే సీపీఐ సర్వసభ్య సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఉచిత ఇసుక ఇస్తామని చెప్పారని.. అయితే ఇప్పటివరకు ఆ హామీ అమలు కాలేదన్నారు. ఇక విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను ఆపాలన్నారు. ప్రత్యేక హోదా, పరిశ్రమల స్థాపనకు కృషి చేయాలన్నారు. జిల్లా పరిధిలోని పలు పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు జనమాల గురవయ్య, తులసి, వైఎస్ మణిరాజన్, గోపి, శివ కుమార్, మోహన్‌రెడ్డి, శ్రీను, మల్లికార్జున, లాజర్, రాజయ్య, మణి, చంద్రయ్య, హరి, జాన్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల అభ్యున్నతిపై ప్రత్యేక దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎస్‌బీసుధాకర్‌రెడ్డి

ఏర్పేడు: తల్లిదండ్రులు తమ పిల్లల అభ్యున్నతిపై ప్రత్యేక దృష్టి సారించాలని సైకాలజిస్ట్ డాక్టర్ ఎస్‌బీ సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నాగంపల్లి సమీపంలో ఎస్‌ఓఎస్ బాలల గ్రామంలో ఎస్‌ఓఎస్‌ఎఫ్ఎస్‌సీ ఆధ్వర్యంలో పేరెంటింగ్ స్కిల్స్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏర్పేడు, శ్రీకాళహస్తి మండలాల నుంచి సుమారు 90 మంది మహిళలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ కుటుంబ వ్యవస్థను పరిరక్షించుకుంటే పురోగతి ఉంటుందన్నారు. తల్లులు తమ పిల్లలపై మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తూ వారిలో నైపుణ్యాలను పెంపొందించాలని సూచించారు. పిల్లల వయస్సు ఆధారంగా వారి అభ్యున్నతికి ఆచరణాత్మక మార్గదర్శకాలు, పిల్లలతో సరైన సంభాషణ, పెంపకం తదితర అంశాలపై తల్లులకు అవగాహన పెంపొందించుకోవాలని చెప్పారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా, సామాజికంగా అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే మహిళల పాత్ర చాలా కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓఎస్ఎఫ్ఎస్‌సీ లొకేషన్ ఇన్‌చార్జి సత్యనారాయణ, మునిరత్నం పాల్గొన్నారు.

సంక్షేమ నిధిని పునరుద్ధరించాలి



టీటీడీ పరిపాలనా భవనంలో సమావేశమైన టీటీడీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

తిరుపతి(అలిపిరి): టీటీడీ ఉద్యోగుల సంక్షేమ నిధి(వెల్ఫేర్ ఫండ్)ని పునరుద్ధరించాలని టీటీడీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చీర్ల కిరణ్ అన్నారు. సోమవారం స్థానిక టీటీడీ పరిపాలనా భవనంలో వెల్ఫేర్ కమిటీ, ఉద్యోగ సంఘ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ పలు నిర్ణయాలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. టీటీడీ ద్వారా వెల్ఫేర్ ఫండ్‌లోని లోటును మ్యాచింగ్ గ్రాంట్ రూపంలో చెల్లించి వెల్ఫేర్ ఫండ్‌ను కొనసాగించాలని డిమాండ్ చేశారు. వెల్ఫేర్ ఫండ్ రికవరీ రూ.45 నుంచి రూ.200 వరకు పెంచి ఈ స్కీమ్‌ను కొనసాగించాలని కోరారు. చనిపోయిన, పదవీ విరమణ పొందిన వారికి దాదాపు మూడేళ్లుగా చెల్లింపులు నిలిపేశారని.. వారికి గతంలో చెల్లించిన విధంగా వెల్ఫేర్ ఫండ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కమిటీ సభ్యులు గోవిందరాజన్(డిప్యూటీ ఈఓ) ఆనందరాజు(డిప్యూటీ ఈఓ), ఉపాధ్యక్షుడు సునీల్ కుమార్ యాదవ్, కార్యదర్శి శ్రీహరి, కోశాధికారి రేఖ, సభ్యులు వంకీపురం పవన్, అశోక్ కుమార్ పాల్గొన్నారు.